రవీంద్రభారతిలో బుధవారం జూనియర్ లెక్చరర్లకు నియామక ప్రతాలు అందించే కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్‌ను ఉద్దేశించి.. మాట్లాడుతూ.. 'మీకు మీరే స్టేచర్ ఉందని ఫీలైతే.. స్టెచర్ మీదకు పంపించారు.. ఇట్లనే చేస్తే ఆ తర్వాత మార్చురీకి పోతారు.' అంటూ అవహేళనగా దూషించారు. రేవంత్ చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలను పలువురు నెటిజన్లు తీవ్రంగా ఖండించారు. రేవంత్‌రెడ్డిది దుష్ట గుణం.. చావే కోరుకుంటారని.. కేసీఆర్‌ది దైవ గుణం.. అందరూ బాగుండాలని ఆశిస్తారని రఘువీర్ రాథోడ్ అనే వ్యక్తి ఎక్స్ వేదికగా ఖండించారు. మరో నెటిజన్ తిరుపతి మరుపాక 'దమ్ముంటే కేసీఆర్‌ను టచ్ చేసి చూడు' అంటూ సవాల్ విసిరారు. నీచులు ఎప్పుడూ నీచంగానే మాట్లాడుతారని ఫైర్ అయ్యారు. శివప్రసాద్‌నారాయణ అనే నెటిజన్ స్పందిస్తూ 'అయ్యా గుంపు మేస్త్రీ నీకు స్ట్రేచర్ పదానికి కనీసం స్పెల్లింగ్ తెలుసా' అంటూ ఎద్దేవా చేశారు. మరో నెటిజన్ స్పందిస్తూ కనకపు సింహాసనమున శునకమును కూర్చుండబెట్టి–మన చిట్టి నాయుడి కోసమే రాసినట్టు ఉంది ఈ పద్యమంటూ రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో నెటిజన్ ప్రేమ్ రెడ్డి స్పందిస్తూ.. అయ్యా రేవంత్ నీ పేరు చివరన రెడ్డి అనే పదం తీసెయ్..నువ్వు మాట్లాడే మాటలకు రెడ్డి పరువు పోతున్నది అంటూ ఎద్దేవా చేశారు. మరో నెటిజన్ ప్రభాకర్ స్పందిస్తూ నువ్వు ఎర్రగడ్డకు పోవడం ఖాయమంటూ విమర్శించారు. సీఎం రేవంత్‌ను ఉద్దేశించి సంతోష్ అనే నెటిజన్ స్పందిస్తూ.. అధికారంలో ఉన్నప్పుడే కేసీఆర్.. రేవంత్ ఓవరాక్షన్‌కు బ్రేకులు వేయాల్సి ఉండే ..అని అభిప్రాయం వ్యక్తం చేశారు.

నమస్తే తెలంగాణ

వికారాబాద్

I | హైదరాబాద్, గురువారం 13 మార్చి 2025 | VIKARABAD

రేవంత్.. ఖబడ్దార్

కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలపై భగ్గుమన్న ప్రజలు, నేతలు

తీరు మార్చుకోకపోతే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరిక..

కేసీఆర్ పాలన స్టేటస్ అని.. రేవంత్ పాలనే స్ట్రెచర్‌పై ఉందంటున్న తెలంగాణ సమాజం

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నామరూపాలు లేకుండా చేసి మార్చురీకి పంపుతామని వార్నింగ్

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. తెలంగాణ సాధకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిపై బుధవారం రవీంద్రభారతిలో జరిగిన సభలో రేవంత్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం భగ్గుమంటున్నది. స్టేటస్, స్ట్రెచర్, మార్చురీ అంటూ అడ్డగోలుగా మాట్లాడడంపై సబ్బండవర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా, రాష్ట్రాన్ని అనేక రంగాల్లో దేశంలోనే ఆదర్శవంతంగా నిలిపిన కేసీఆర్‌పై అహంకార ధోరణతో ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సీఎం స్థాయికి తగదని అభిప్రాయపడుతున్నాయి. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపివేస్తానంటూ వ్యాఖ్యలు చేస్తున్న రేవంత్‌రెడ్డి చరిత్రహీనుడు గా మిగలడం ఖాయమని ప్రజలు హెచ్చరిస్తున్నారు. మొన్నటిదాకా కేసీఆర్ అసెంబ్లీకి రాలేదంటూ గగ్గోలు పెట్టిన రేవంత్.. ఆయన శాసనసభకు వచ్చిన రోజే అదుపుతప్పి మాట్లాడడం రేవంత్ వైఖరికి అద్దం పడుతున్నదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కేసీఆర్ అంటే నిలువెత్తు ధైర్యం అని, అదే ధైర్యంతో కేంద్రం మెడలు వంచి తెలంగాణ సాధించాడని, ఇప్పుడు అదే ధైర్యం, వ్యూహాలతో భవిష్యత్తులో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా రేవంత్ భాష మార్చుకోకుంటే.. భవిష్యత్‌లో బయట తిరగడం కూడా కష్టమవుతుందని బీఆర్ఎస్ శ్రేణులు హెచ్చరిస్తున్నాయి.

- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

చిల్లరగా మాట్లాడటం సరికాదు

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో ముఖ్యమంత్రి హోదాలో ఉండి రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు. ప్రజాపాలనను గాలికి వదిలేసి కేసీఆర్, కేసీఆర్ కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ పొద్దుగడుపుతున్నారు. సంవత్సరానికిపైగా కేసీఆర్, కేసీఆర్ కుటుంబాన్ని బదనాం చేస్తున్నారు. చేతనైతే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చి చూపాలి. ఇష్టానుసారంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదు. కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకతను మూటగట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన అద్భుతంగా ఉందని ప్రజలు మెచ్చుకుంటున్నారు. ఎప్పుడు ఎన్నికలు పెట్టినా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. కేసీఆర్ కుటుంబంపై విమర్శలు ఆపి రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలి. ఇన్నేళ్ల కాలంలో ఈ విధమైన సీఎంను చూడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బుద్ధి మార్చుకొని వ్యక్తులను గౌరవించడం నేర్చుకో..

- బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

చేతగాని సీఎంతో తెలంగాణ తలవంచుకొంటున్నది

రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎందుకు ఎన్నుకొన్నామా అని నేడు తెలంగాణ ప్రజలు బాధపడుతున్నారు. సీఎం హోదాలో ఉంటూ బూతు పురాణం వల్లె వేయడం మానుకోవడంలేదు. తెలంగాణ సాధించిన మహోన్నత వ్యక్తి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. పాలన చేతకాక ఈ విధంగా కేసీఆర్ కుటుంబంపై అబద్ధపు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇదేం ఆయనకు కొత్త కాదు. కానీ సీఎం హోదాలో ఉండి, తెలంగాణకు బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన ఆయననే ఈ విధమైన అనుచిత వాఖ్యలు చేస్తే.. రానున్న రోజుల్లో ప్రజలే ఆయనకు బుద్ధి చెబుతారు.. తస్మాత్ జాగ్రత్త. కేసీఆర్ గురించి మాట్లాడే అర్హత రేవంత్‌కు లేదు. పదేళ్లు తెలంగాణను దేశ చరిత్రలో ఉన్నత స్థానాన్ని నిలిపిన గొప్ప వ్యక్తి కేసీఆర్. గడిచిన 15 నెలల కాలంలో రేవంత్ తెలంగాణకు ఒకగబెట్టిందుమీలేదు. నోటి దురుసు తప్ప, అభివృద్ధిపై ఆయనకు కించిత్తు కూడా శ్రద్ధలేదు. నోటి దురుసు చాలించి అభివృద్ధి చేసి చూపించు. గతంలో ఏ సీఎంను ఈవిధంగా బూతులు తిట్టిన ప్రజలు లేరు. కానీ నేడు ఎక్కడ చూసినా సీఎంపై ప్రజలు సెటైర్లు వేస్తున్నారు. అభివృద్ధితో ప్రజలతో మంచి అనిపించుకో ఇదే నా సలహా..

- పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కొడంగల్

మతిభ్రమించి మాట్లాడుతున్న సీఎం

సీఎం రేవంత్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం తనను సీఎం పదవి నుంచి తప్పిస్తుందనే ఫ్రస్ట్రేషన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నోటికి వచ్చినట్లుగా ఏది పడితే అది మాట్లాడుతున్నారు. అధికారంలోకి వచ్చిన 14 నెలల కాలంలో ఎన్నికల హామీలను పూర్తిగా పక్కన పెట్టి, ప్రజా సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేశారు. రేవంత్ పాలన నచ్చకపోవడంతో ప్రజలు తిరగబడే పరిస్థితి నెలకొంది. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం సైతం రేవంత్‌రెడ్డిని పక్కన పెట్టడంతో ఏమి చేయాలో పాలుపోవడంలేదు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లపై సీఎం రేవంత్ అవాకులు, చవాకులు పేలుతున్నారు. పాలన చేతకాకనే ప్రతిపక్షాలపై రేవంత్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారు. ఒక ముఖ్యమంత్రి హోదాలో ఎలా మాట్లాడాలో సైతం తెలియడంలేదు. బీఆర్ఎస్ పాలనలో విద్య, వైద్యంతో పాటు వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన కేసీఆర్‌ను ఎక్కడ బడితే అక్కడ వ్యక్తిగతంగా రేవంత్ విమర్శించడం సరికాదు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి తన ధోరణి మార్చుకోవాలి, లేదంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు.

- కొప్పుల మహేశ్‌రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే

స్థాయిని మరిచి మాట్లాడుతున్నారు

ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి గల్లీ లీడర్‌గా వ్యవహరిస్తున్నారు. రవీంద్రభారతిలో జరిగిన జూనియర్ లెక్చరర్ల సమావేశంలో ఆయన దిగజారి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రిని మార్చురీకి పంపిస్తామని మాట్లాడటాన్ని ఆయన వివేకానికే వదిలిపెడుతున్నాం. రాష్ట్ర రాజకీయాలను సీఎం రేవంత్‌రెడ్డి భ్రష్టు పట్టిస్తున్నారు. రాజకీయాల్లో హుందాతనమే లేకుండా పోయింది. ఆయన స్థాయిని తగ్గించుకుని మాట్లాడటం సమంజసం కాదు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటాలు చేసి రాష్ట్రాన్ని తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారు. కేసీఆర్ శ్రమ ఫలితంగా వచ్చిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగలిగారు. రాష్ట్రమే సాధించకపోతే ఆయన పరిస్థితి ఏమిటో తెలుసుకోవాలి. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ప్రతిపక్షాలను గౌరవించే సంప్రదాయాలు నేర్చుకోవాలి. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను మరిచి బంగారు తెలంగాణను అప్పుల తెలంగాణ రాష్ట్రంగా సీఎం రేవంత్‌రెడ్డి మార్చాడు.

- బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మానవత్వం లేకుండా మాట్లాడుతున్నారు

సీఎం రేవంత్‌రెడ్డి మానవత్వం లేకుండా మాట్లాడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేసి రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌దే అన్న విషయాన్ని కూడా విస్మరించి ఆయనపై అనుచిత వాఖ్యలు చేయటం సిగ్గుచేటు. సీఎంగా రేవంత్ అన్ని రంగాల్లో ఫెయిల్ అయ్యారు. అధికారం కోసం ప్రజలను మభ్యపెట్టి అలవికాని హామీలిచ్చారు. ప్రజలంతా రేవంత్‌రెడ్డిని చీదరించుకుంటున్నారు. కేసీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తూ స్ట్రెచర్‌పైకి పోయాడని, మార్చురీకి పోతాడని మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనం. ఆయన తీరు మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారు.

- అంజయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే, షాద్‌నగర్

రేవంత్‌రెడ్డి రాజకీయ అజ్ఞాని

రేవంత్‌రెడ్డి ఓ రాజకీయ అజ్ఞాని. ఆయన రాజకీయాల్లో చీడపురుగులాంటి వాడు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తిని పట్టుకుని స్ట్రెచర్, మార్చురీ లాంటి మాటలు సంబోధించడం సిగ్గుచేటు. రేవంత్‌రెడ్డి ప్రజల అభిమానాన్ని పోగొట్టుకోవటంతోపాటు అధిష్ఠానం వద్ద కూడా చులకన అయ్యారు. దాని నుంచి తనను తాను కాపాడుకోవడం కోసం కేసీఆర్‌ను టార్గెట్ చేసి మాట్లాడుతున్నారు. రేవంత్‌కు రాజకీయాల్లో కొనసాగే నైతిక హక్కు లేదు. ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. ఇప్పటికైనా రేవంత్ గౌరవించే సంప్రదాయాన్ని అలవాటు చేసుకోవాలి.

- జైపాల్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే, కల్వకుర్తి

రేవంత్.. నోరు అదుపులో పెట్టుకో

రేవంత్.. నోరు అదుపులో పెట్టుకో.. నీ చిల్లర కూతలు ఆపు.. లేదంటే ప్రజలే తరిమికొడతారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, దేశంలోనే అగ్రభాగాన నిలిపిన కేసీఆర్‌ను బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన 'ప్రజా ప్రభుత్వంలో కొలువుల జాతర' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా విమర్శించడం ఏమిటని ప్రశ్నించారు. పోరాడి తెలంగాణ రాష్ట్రం సాధించిన యోధుడు కేసీఆర్.. హైదరాబాద్‌ను ప్రపంచంలోనే ఐటీ మేటీగా నిలిపిన నేత కేటీఆర్.. సాగు నీటి రంగంలో విప్లవాన్ని తెచ్చిన నేత హరీశ్‌రావు.. అలాంటి వారిని నోటికి వచ్చినట్లు మాట్లాడడం రేవంత్‌రెడ్డి చిల్లరతనానికి నిదర్శనం. బీఆర్ఎస్ పాలనలో విద్య, వైద్యంతో పాటు వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన కేసీఆర్‌ను ఎక్కడ బడితే అక్కడ వ్యక్తిగతంగా రేవంత్ విమర్శించడం సరికాదు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను మరిచి బంగారు తెలంగాణను అప్పుల తెలంగాణ రాష్ట్రంగా సీఎం రేవంత్‌రెడ్డి మార్చాడు. రేవంత్... ఒక కార్యక్రమమైనా విజయవంతంగా నిర్వహించావా..? కేసీఆర్‌ను తిట్టుకుంటా పబ్బం గడపడం తప్ప నువ్వు చేస్తున్నదేమిటి? కేసీఆర్ కుటుంబంపై విమర్శలు ఆపి రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలి.

- పంజుగుల రోహిత్‌రెడ్డి, తాండూరు మాజీ ఎమ్మెల్యే

కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాల అభివృద్ధి

కడ్తాల్‌లో కేసీఆర్ చిత్రపటానికి రంగులు చల్లి హోలీ సంబురాలు చేసుకున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మహిళలు

కడ్తాల్, మార్చి 12 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో.. రాష్ట్రంలోని సబ్బండ వర్గాలు అభివృద్ధి సాధించాయని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎల్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో హోలీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, నాయకులు, అభిమానులు కేసీఆర్ చిత్రపటానికి రంగులు చల్లి సంబురాలు చేసుకున్నారు. మహిళల సంక్షేమానికి బీఆర్ఎస్ పాలనలో అనేక పథకాలు అమలు చేశారని మహిళలు కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయంలో జరిగిన అభివృద్ధే గ్రామాల్లో కనిపిస్తున్నదని తెలిపారు. కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిన కేసీఆర్‌ను... మహిళలు పెద్దన్నలాగా, మేనమామలాగా భావిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధినే గుర్తు చేసుకుంటున్నారన్నారు.

14 జిల్లాలు.. 14 మండలాలు

హెచ్ఎండీఏ విస్తరణ

సిటీబ్యూరో, మార్చి 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం హెచ్ఎండీఏ పరిధిని విస్తరించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడు జిల్లాలున్న హెచ్ఎండీఏలో మరో నాలుగు జిల్లాలను విలీనం చేస్తూ మొత్తంగా 11 జిల్లాలు, 104 మండలాలు, 1355 గ్రామాలతో 10472 చదరపు కిలోమీటర్లకు పరిధిని విస్తరించింది. దీంతో హెచ్ఎండీఏ పరిధి ఓ ఆర్ ఆర్ నుంచి త్రిబుల్ ఆర్ వరకు చేరనున్నది. తాజా ఉత్తర్వుల్లో విలీన గ్రామాలు, మండలాలు జిల్లాల వారీగా జాబితాను వెల్లడించింది. కొత్తగా హెచ్ఎండీఏ పరిధిలో మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వికారాబాద్, నల్గొండ జిల్లాల పరిధిలోని పలు గ్రామాలు జాబితాలో చేరిపోయాయి. దీంతో అదనంగా 3వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో హెచ్ఎండీఏ ఆధీనంలోకి చేరింది.

నిధులు లేక.. అభివృద్ధి కానరాక..

గ్రామాలవైపు కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు

ప్రత్యేక పాలనలో అంతా అస్తవ్యస్తం

మౌలిక సదుపాయాలు కూడా కరువు

సమస్యలు ఎవరికి చెప్పకోవాలో అర్థంకాని పరిస్థితిలో ప్రజలు

జిల్లాలో 16 మున్సిపాలిటీలు, 2 మున్సిపల్ కార్పొరేషన్లున్నాయి. వీటికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు ఏమాత్రం రావడంలేదు. కార్పొరేషన్లకు కేవలం ఇంటిపన్ను, భవన నిర్మాణ అనుమతుల వంటి వాటి వల్ల వచ్చే ఆదాయంతో జీతాలు, ఇతరత్రా వాటికి ఖర్చు చేస్తున్నారు. కాని, ఏ ఒక్క అభివృద్ధి పని కూడా జరుగటంలేదు. ముఖ్యంగా నగర శివారుల్లోని మున్సిపాలిటీల్లో కొత్తకొత్త కాలనీలు ఏర్పడుతున్నాయి. కొత్త కాలనీల్లో రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే, తాగునీటి సమస్య కూడా రోజురోజుకూ పెరిగిపోతున్నది. ఔటర్ లోపలి మున్సిపాలిటీలకు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో తాగునీరు అందిస్తున్నారు. ఈ మున్సిపాలిటీలకు రెండు రోజులకోసారి తాగునీరు వస్తున్నదని ప్రజలు వాపోతున్నారు. ఔటర్ వెలుపలి మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ఎండలు మండిపోతున్న నేపథ్యంలో మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరు ఏమాత్రమూ సరిపోవడంలేదని, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

519 గ్రామపంచాయతీలు..

జిల్లాలో 519గ్రామపంచాయతీలున్నాయి. ఈ గ్రామపంచాయతీల్లో రోజురోజుకూ సమస్యలు తిష్టవేస్తున్నాయి. గ్రామపంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ఏడాది దాటుతున్నది. ఎన్నికలు జరుపకపోవడం వలన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు కూడా రావడంలేదు. టాక్స్‌లు కూడా అంతంతమాత్రంగానే వసూలవుతుండటంతో పంచాయతీల నిర్వహణ మరింత భారంగా మారింది. పంచాయతీ కార్యదర్శులు పంచాయతీల పాలనను భుజాలపై వేసుకుని మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జీతాలు, వీధి దీపాలు, పైపులైన్ల మరమ్మతు వంటి వాటికి కార్యదర్శులు సొంతంగా ఖర్చుపెడుతున్నారు. కాని, వాటికి బిల్లులు మాత్రం సకాలంలో ఇవ్వడంలేదు. అలాగే, గ్రామాల్లో నిధుల లేమితో అభివృద్ధి పూర్తిగా పడకేసింది.

జిల్లాలో ప్రత్యేకాధికారుల పాలనలో మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. గ్రామాలవైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. దీంతో తమ సమస్యలను ఎవరికి చెప్పకోవాలో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. తాగునీటి సమస్య కూడా అస్తవ్యస్తంగా మారింది. రెండుమూడు రోజులకోసారి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయి. వీధి దీపాలు వెలగడంలేదు. ముఖ్యంగా గ్రామపంచాయతీల్లో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. పంచాయతీ, పారిశుధ్య సిబ్బందికి కూడా వేతనాలు అందని పరిస్థితి. ఆయా గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు సొంత నిధులతో వీధి దీపాలు, ఇతరత్రా వాటికి సొంతంగా నిధులు ఖర్చుచేసి బిల్లులు పెట్టినప్పటికీ బిల్లులు అందే పరిస్థితి లేకుండా పోయింది. అలాగే, మున్సిపాలిటీల్లో కూడా ఇంటి పన్నులు, గృహనిర్మాణ అనుమతుల ద్వారా వచ్చే ఆదాయంతో జీతభత్యాలు, చెత్త సేకరణ వాహనాల డీజిల్‌కు మాత్రమే సరిపోతున్నాయి. దీంతో అటు పంచాయతీలు, ఇటు మున్సిపాలిటీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి.

- రంగారెడ్డి, మార్చి 12 (నమస్తే తెలంగాణ)

మున్సిపాలిటీలో ప్రవహిస్తున్న మురుగునీరు

పత్తాలేని ప్రత్యేకాధికారులు

గ్రామపంచాయతీ, మున్సిపాలిటీల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. కాని, ప్రత్యేకాధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజల అవసరాలను తెలుసుకుని ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉన్నది. కనీసం వారానికోరోజైనా ప్రత్యేకాధికారులు గ్రామాలకు వెళ్లాల్సి ఉన్నది. కాని, వారు గ్రామాలవైపు కన్నెత్తి కూడా చూడటంలేదని ఆరోపణలున్నాయి. అలాగే, మున్సిపాలిటీల్లో కూడా మూడు నుంచి నాలుగు మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారిని నియమించారు. ప్రత్యేకాధికారులు మున్సిపాలిటీలకు వెళ్లకపోవడం వలన మున్సిపాలిటీల్లో అధికారులే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ప్రభుత్వం స్పందించి మున్సిపాలిటీలు, పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

పడకేసిన అభివృద్ధి

జనవరి 26న మున్సిపాలిటీ కార్యవర్గం గడువు ముగియడంతో 27 నుంచి ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. అప్పటి నుంచి ఆమనగల్లు మున్సిపాలిటీలో అభివృద్ధి కుంటుపడింది. ప్రత్యేక అధికారి కార్యాలయాలకు రాకపోవడం కూడా అభివృద్ధి కాకపోవడం ఒక కారణం. గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి తప్పితే మున్సిపాలిటీలో పెద్దగా ఏ అభివృద్ధి కార్యక్రమం జరుగలేదు.

- చుక్క నిరంజన్‌గౌడ్, ఆమనగల్లు

మున్సిపాలిటీ వ్యవస్థ అస్తవ్యస్తం

మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులుగా నియమించినవారికి పలు బాధ్యతలు ఉండటంతో మున్సిపాలిటీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. మున్సిపాలిటీలకు నిధుల కొరత ఉండటంతో అభివృద్ధి ఆమడ దూరంలో ఉన్నది. ప్రభుత్వం వెంటనే ఎలక్షన్లు నిర్వహించి పాలకవర్గాలను ఏర్పాటు చేస్తే తప్ప అభివృద్ధి జరుగదు.

- కొమ్ము ప్రసాద్ (ఆమనగల్లు)